సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

55 మంది సత్యసాయి సేవకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రక్తదాన శిబిరంలో 55 మంది సేవకులు రక్తదానం చేశారు. నగరానికి చెందిన బ్లడ్ సెంటర్ వైద్యుడు యుగంధర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి శంకర్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు 26వ సారి రక్తదానం చేసిన సందర్భంగా సత్యసాయి సేవకులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సేవకులు ఆర్.ఎ.నాయుడు, ఎం.ఈశ్వరరావు, రాంప్రసాద్, సమితి కన్వీనర్ జి.సత్యనారాయణ, వివిధ సేవాదళాల అధిపతులు ఎం.వి.సత్యసాయికుమార్, టీవీఆర్ బాబా, పి.రవిప్రసాద్, సిహెచ్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై కాంక్రీట్‌తో ప్రమాదాలు



రోడ్డు మీదే వదిలేస్తున్న కాంక్రీట్

కొమ్మాది: తిమ్మాపురం నుంచి మారికవలసకు వెళ్లే మార్గంలో ఇటీవల కొత్త రోడ్డు నిర్మించారు. ఇప్పుడు కొన్ని ప్రైవేటు కంపెనీలకు చెందిన వారు మిషన్ల ద్వారా మిగిలిన కాంక్రీట్‌ను ఆ రోడ్డు మీదే వదిలేస్తున్నారు. దీంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ సమస్యపై గతంలో అధికారులు చర్యలు తీసుకున్నా.. మళ్లీ ఇలా రోడ్డుపైనే కాంక్రీట్‌ను వేస్తున్నారు. ఇలాంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


బీజేపీ అర్బన్ మండల అధ్యక్షుడిగా కొండబాబు



ఎన్నికల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

భీమునిపట్నం: బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఆదివారం భీమిలిలోని పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో భీమిలి అర్బన్, మండల అధ్యక్షుడిగా ఊళ్ల కొండబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరగ్గా.. నాయకులందరూ ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వాసుపల్లి శ్రీహరి, ధోని నాగరాజు, కంటుభుక్త సునీత, పోలుబోతు విజయ, కోడూరు సంజీవరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఐక్య గ్రాండ్ క్రిస్మస్



పాటలు పాడుతున్న చర్చి టీమ్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని చారిత్రక సెయింట్ పీటర్స్ చర్చి ఆధర్వ్యంలో పాస్టర్లు, మిషనరీల ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వేడుక బీచ్ సమీపంలో ఆదివారం సాయంత్రం చర్చి సంఘ గౌరవ కార్యదర్శి కులిడి సురేష్‌బాబు సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ వర్షాల వల్ల క్రిస్మస్ ముందు ఈ కార్యక్రమం నిర్వహించలేకపోయామని తెలిపారు. అనంతరం రెవరెండ్ జాన్ బాబు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. చర్చి సభ్యులు పాడిన పాటలు అలరించాయి. పాస్టర్లు గిడియన్ విజయకుమార్, జాకబ్, ఇమాన్యుయేల్, చర్చి పెద్దలు సుశీల్‌రావు, హైమావతి, సుధాకర్, సురేష్ పాల్గొన్నారు.



మైలపల్లి కళ్లాలు నుంచి రామాలయం ఎదురుగా మలుపు



కొండపేట వద్ద ప్రమాదకర మలుపు



చిట్టివలస - గుడివాడ వంతెన అప్రోచ్ రహదారిపై దూసుకుపోతున్న ద్విచక్రవాహనాలు

ప్రమాదాల మార్గం

- ప్రమాదకరంగా చిట్టివలస–గుడివాడ– గోస్తనీ రహదారి
- మలుపుల మార్గంలో వేగంగా వాహనాల రాకపోకలు
- స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, స్టాపర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్



ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రమాదకర మలుపు



ఇటీవల అప్రోచ్ రోడ్డులో ప్రమాదానికి గురైన వ్యక్తి

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస జ్యూట్‌మిల్లు నుంచి రామాలయం, కొండపేట మీదుగా గుడివాడ వైపు వెళ్లే గోస్తనీ నది వంతెన అప్రోచ్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. మిల్లు రోడ్డు నుంచి వంతెన వరకు నాలుగు ప్రమాదకరమైన మలుపుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో వాహనాల వేగానికి కళ్లెం వేసే స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్లు లేకపోవడంతో నడిచి వెళ్లే వారు సైతం ఆందోళనకు గురవుతున్నారు. నిత్యం ఈ మార్గంలో విశాఖ, విజయనగరం జిల్లాల వాసులతోపాటు ద్విచక్ర వాహనాలపై దివీస్ లేబొరేటరీకి వేల సంఖ్యలో ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా ఈ మార్గంలో శ్మశానవాటిక, ఫంక్షన్ హాళ్లు, మూడు హైస్కూళ్లు, డిగ్రీ కళాశాల, నాలుగు ఆలయాలు, వసతి గృహం ఉన్నాయి. రోజూ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటలకు వరకు ఈ రహదారి రద్దీగా ఉంటుంది. అసలే ఇరుకైన మార్గం... ఆపై వేగంగా వెళ్లే వందలాది వాహనాల కారణంగా సమస్యాత్మకంగా మారిపోయింది. కనీసం ప్రమాదాల నివారణకు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కీలకంగా మారిన రహదారి

తగరపువలస నుంచి జాతీయ రహదారి మీదుగా భీమిలి మండలంలోని చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, అన్నవరం పంచాయతీలతోపాటు భోగాపురం మండలంలోని చెరకుపల్లి, గుడివాడ, తూడెం పంచాయతీలకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. వెంకటేశ్వరమెట్ట వద్ద జాతీయ రహదారిపైకి చేరుకునే అవకాశం లేకుండా పోవడంతో ఈ ఆరు పంచాయతీల ప్రజలతోపాటు వేలాది మంది దివీస్ ఉద్యోగులు వంతెన అప్రోచ్ రహదారి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. దీనివల్ల వీరికి సమయం కూడా కలిసొస్తుంది. కానీ ఈ రహదారిపై వాహనశ్రేణి ఒత్తిడి కారణంగా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అప్రోచ్ రోడ్డును ఆనుకుని ఉన్న కొండపేట, కొత్తపేట, చిట్టివలస, గుడివాడ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జ్యూట్‌మిల్లు రామాలయం వద్ద మలుపులో ప్రమాదకర డ్రైనేజీ

వాహనాలు ఢీకొట్టి వెళ్లిపోతున్నాయి..



వంతెన అప్రోచ్ రోడ్డులో వేగంగా వెళ్లే వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పాదచారులను వాహనదారులు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోతున్నారు. వాహనాల వేగాన్ని అదుపు చేసేలా స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– రొక్కం శ్రీను, కొత్తపేట

దివీస్ యాజమాన్యం స్పందించాలి



గోస్తనీ వంతెన అప్రోచ్ రహదారిలో ఎక్కువ మంది దివీస్ ఉద్యోగులే రాకపోకలు సాగిస్తున్నారు. వారి సంక్షేమం దృష్ట్యా ఆ సంస్థ యాజమాన్యమే మార్కింగ్‌తో పాటు, టైర్ల మ్యాట్‌లను ఉపయోగించి సున్నితమైన స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– బండారు నానాజీ, చిట్టివలస

బంగ్లామెట్ట మీదుగా అనుమతించాలి



తగరపువలస కూడలి నుంచి బంగ్లామెట్ట మీదుగా జాతీయ రహదారికి వాహనాలను అనుమతించేలా వెంకటేశ్వరమెట్ట వద్ద కూడలి ఏర్పాటు చేయాలి. అప్పుడే వంతెన అప్రోచ్ రోడ్డుపై వాహనాల ఒత్తిడి తగ్గుతుంది. ప్రమాదాలూ తగ్గుతాయి.

– చిల్ల సూర్యనారాయణరెడ్డి, స్థానికుడు

శ్మశానవాటికలో డెబ్రిస్ డంపింగ్



చిట్టివలస శ్మశానవాటిక ముందు డంప్ చేసిన డెబ్రిస్

తగరపువలస: చిట్టివలస శ్మశానవాటిక ముందు కొంత కాలంగా డెబ్రిస్ పోగులు పేరుకుపోతున్నాయి. ఇటీవల ఈ ప్రాంతంలో కూలగొట్టిన పాత భవనాల డెబ్రిస్‌ను రవాణా వాహనాలతో తీసుకువచ్చి శ్మశానవాటిక ప్రహరీని ఆనుకుని వరుసగా డంప్ చేస్తున్నారు. దీంతో వర్షాలకు డెబ్రిస్ తడిచి బరువెక్కి వీటి భారం ప్రహరీలపై పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్మశానవాటికలో వసతులు సమకూర్చింది. అందులో భాగంగా ప్రహరీ కూడా ఏర్పాటు చేశారు. ఇప్పుడు ప్రహరీ దెబ్బతినేలా డెబ్రిస్ పోగులు వేయడం వల్ల అది కూలిపోయే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది నిఘా ఉంచి విచ్చలవిడిగా డెబ్రిస్ పోగులు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గాలికొదిలేసిన పారిశుద్ధ్య నిర్వహణ



రోడ్డు మీద ప్లాస్టిక్ వ్యర్థాలు

కొమ్మాది: జీవీఎంసీ 5వ వార్డులో పారిశుద్ధ్య నిర్వహణ గాలికి వదిలేశారు. ఎన్నిసార్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా.. శానిటేషన్ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మారికవలస, బోరవానిపాలెం, పరదేశిపాలెం ప్రాంతాల్లో నిత్యం వ్యర్థాలు రోడ్లపై దర్శనమిస్తున్నాయని, దీనిపై ఫిర్యాదు చేసినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పేరుకుపోయిన చెత్త వల్ల పలు వ్యాధులు ప్రబలే అవకాశముందని, పారిశుద్ధ్య అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



అలంకరణలో పంచముఖ ఆంజనేయ స్వామి

మధురవాడ : చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. శ్రీ షిర్డీ సాయినాథ సహిత శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా క్షేత్ర పాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామికి ఉదయం పంచామృత, సుగంధ ద్రవ్యాభిషేకాలు, నాగవల్లి దళార్చన, సింధూర అర్చన చేశారు. చంద్రంపాలెం, మధురవాడ పరిసర ప్రాంతాల భక్తులకు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు సోమవారం వేకువజాము నుంచి పంచామృత సుగంధ, జలాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహిస్తామని, భక్తులంతా అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

ఉద్యోగం, ఉపాధి సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న విద్యాసంస్థల చైర్మన్ రమేష్





విద్యార్థిని నృత్యం, జాతర డ్యాన్స్ చేస్తున్న విద్యార్థి

తగరపువలస: ఉద్యోగం, ఉపాధి ప్రధాన లక్ష్యంగా విద్యాభ్యాసం కొనసాగాలని స్థానిక శ్రీబాసర విద్యా సంస్థల చైర్మన్ పూడి రమేష్ అన్నారు. శ్రీబాసర జూనియర్ కళాశాల విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు ఆదివారం ఆనందపురం మండలం పెద్దిపాలెం ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు జోనల్ ప్రిన్సిపాల్ వి.వి.డి.రమేష్, డిఫెన్స్ కోచింగ్ హెడ్ కె.మహేశ్వర రెడ్డి, సలహా కమిటీ సభ్యుడు డి.సత్యనారాయణరాజు తదితరులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



గెద్దపేటలో త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

పద్మనాభం : మండలంలోని ఐనాడ, కోరాడ పంచాయతీ గెద్దపేటలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. భగవద్గీత ప్రాముఖ్యతను అందరికీ తెలియజేశారు. మార్గశిర మాసం డిసెంబర్ 30తో ముగుస్తుందన్నారు. భక్తితో భగవద్గీతను పఠిస్తే జ్ఞాన మార్గంలో పయనించగలరని సూచించారు. కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు జి.కృష్ణ సూరప్పడు, బి.పైడన్న, కె.సంతోషి, కె.రాజు, లక్ష్మి, సత్యం, శ్యామ్ ప్రచారం చేశారు.

వైభవుడికి కదంబం సమర్పణ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన కదంబం ప్రసాదం సమర్పించారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాలార్చన చేశారు. మేళతాళాల మధ్య వేద మంత్రోచ్ఛరణతో గోదాదేవి అమ్మవారి విగ్రహంతో అర్చకుడు శేషాచార్యులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం తిరుప్పావై సేవా కాలం, విశేష భోగం సమర్పించారు. గోదాదేవి తరుపున శ్రీరంగనాథుడికి 14వ పాశురం విన్నవించారు. అనంతరం వైభవుడికి కదంబం ప్రసాదాన్ని సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మార్కెట్ ఆదాయం జాస్తి.. వసతులు నాస్తి

పట్టించుకోని వేములవలస పంచాయతీ పాలకవర్గం



బురదమయంగా వేములవలస మార్కెట్ మధ్య నుంచి ఆనందపురానికి వెళ్లే రోడ్డు



దుకాణాల మధ్య పూడుకుపోయిన డ్రైనేజీ

తగరపువలస : ఆనందపురం మండలం వేములవలస పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్కెట్‌లో వసతులు కొరవడడంతో వ్యాపారులు, వినియోగదారులు సమస్యలతో సతమతమవుతున్నారు. రాష్ట్రంలోనే పెద్దదైన ఈ మార్కెట్‌కు రాత్రి 12 గంటల తర్వాత నుంచే వ్యాపారులు వస్తుంటారు. భీమిలి డివిజన్ రైతులతోపాటు ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలు, పక్క రాష్ట్రాలు నుంచి పువ్వులు, కూరగాయలు ఎక్కువగా ఈ మార్కెట్‌లో హోల్‌సేల్‌కు లభ్యమవుతాయి. పంచాయతీకి ఏటా ఆశీలు వసూలుకు బహిరంగ వేలం ద్వారా రూ.కోటిన్నర వరకు ఆదాయం లభిస్తుంది. అయినప్పటికీ మార్కెట్‌లో వసతులు కల్పించడం లేదు. వేములవలస నుంచి మార్కెట్ మధ్య నుంచి ఆనందపురం వెళ్లే మార్గం నిత్యం చెత్తతో నిండి ఉంటుంది. ఇక వర్షం కురిస్తే ఈ మార్గంలో రాకపోకలు నరకాన్ని తలపిస్తుంటాయి. మార్కెట్ మధ్యలో పూడుకుపోయిన డ్రైనేజీలు, పని చేయని కుళాయిలు, అపరిశుభ్ర వాతావరణంలో కుళాయిలు, అసంపూర్తిగా నిలిచిపోయిన వాష్‌రూమ్‌లు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. పంచాయతీ పాలకవర్గం స్పందించి మార్కెట్‌లో వసతులు కల్పించాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.



మార్కెట్‌లో నిలిచిపోయిన వాష్‌రూమ్ నిర్మాణ పనులు



మార్కెట్ వద్ద పనిచేయని కుళాయి

డంపింగ్ యార్డులుగా శివారు రోడ్లు



డంపింగ్ యార్డులా దర్శనమిస్తున్న ఓజోన్ వ్యాలీ రోడ్డు

మధురవాడ : జీవీఎంసీ 5, 6 వార్డుల పరిధిలోని శివారు ప్రాంతాల్లో రోడ్లు డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా మారికవలస జంక్షన్ - తిమ్మాపురం రోడ్డు, ఓజోన్ వ్యాలీ రోడ్డు, ఓజోన్ వ్యాలీ, సాయిరాం కాలనీ రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మాస్టర్ ప్లాన్ రోడ్లను ఆనుకుని ఉన్న ఖాళీ లే అవుట్లలోనూ కొందరు ఇష్టారాజ్యంగా డెబ్రిస్ డంపింగ్ చేసేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. చెత్త, గృహ నిర్మాణ, ఇతర వ్యర్థాలు డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉన్నా రోడ్డు పక్కనే ఇష్టానుసారంగా డంపింగ్ చేసేస్తున్నారు. కొందరు లారీ యజమానులు డంపింగ్ యార్డుకు తరలిస్తే ఎక్కువ ఖర్చు అవుతుందని, రోడ్ల శివారు ప్రాంతాల్లో డంపింగ్ చేసేస్తున్నారు. దీంతో ఎంతో విలువైన, సుందరమైన రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఇలా చేయడం స్వచ్ఛభారత్ లక్ష్యానికి తూట్లు పొడవడమేనని స్థానికులు వాపోతున్నారు. వార్డు సచివాలయాల్లో శానిటేషన్ కార్యదర్శులు ఉన్నా, వారి పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని పలువురు వాపోతున్నారు. కనీసం ఉన్నతాధికారులైనా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



హైవేను ఆనుకుని ఓజోన్ వ్యాలీ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డులో చెత్త

ముగిసిన 'వేంకటేశ్వర వైభవం' ప్రవచనాలు

ఎంవీపీ కాలనీ: శ్రీ సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కు వేదికగా ఈ నెల 26 నుంచి జరుగుతున్న శ్రీ వేంకటేశ్వర వైభవం ప్రవచన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విభీషణ శర్మ వేంకటేశ్వర స్వామి వైభవంపై చివరి రోజు చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రవచనాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిగీతాలాపనలు ఆకట్టుకున్నాయి. పూజా కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్యక్రమ నిర్వాహకులు కందాళ అరుణగాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9493185214

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com